రక్తహీనతతో ప్రాణాపాయం

- పిల్లలు, యువత, గర్భిణుల్లో అధికం
- అశ్రద్ధ చేస్తే ప్రమాదం


గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వల్ల నేడు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు మొదలుకొని కళాశాల యువత కూడా రక్తహీనత బారిన పడుతున్నారు. గర్భిణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. గుంటూరు జిల్లాలో 2023 ఏప్రిల్ నుంచి నవంబరు వరకు 12,697 మంది గర్భిణులు ఉన్నట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. వీరిలో 7,146 మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా జూన్ నుంచి డిసెంబరు వరకు 7,636 మంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. నివారించని పక్షంలో గర్భిణులు కాన్పు సమయాల్లో మృతి చెందుతారు. జిల్లాలో ప్రతినెలా మాతృ మరణాల నివారణ కోసం నిర్వహించే సమీక్షలో గర్భిణులు రక్తహీనత వల్లే చనిపోతున్నట్లు వైద్యాధికారులు నిర్ధారణ చేస్తున్నారు. రక్తహీనత నివారించదగినదే. కొద్దిపాటి అవగాహన కల్గి ఉండి జాగ్రత్తలు తీసుకుంటే దరిచేరదనే విషయాలను వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

రక్తహీనత అంటే...

రక్తానికి హిమోగ్లోబిన్ అనే పదార్థంతో ఎర్రని రంగు వస్తుంది. ఇది ఇనుము అనే లోహానికి సంబంధించినది. శరీరంలో రక్తం ఉండాల్సిన పరిమాణంలో లేకపోయినా, ఉండాల్సిన పరిమాణంలో ఉండి అందులో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్నా దాని రక్తహీనత(ఎనీమియా) అంటారు.

రక్తహీనతకు కారణాలు

- ఆహారంలో ఇనుముకు సంబంధించిన పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు, ప్రోటీన్లు తగినంత లేకపోవడం.
- రక్తం ఉత్పత్తయ్యే దానికన్నా గర్భస్రావాలు, కాన్పులు, నెలసరి రుతుస్రావం, మొలలు మొదలైన వాటి వల్ల ఎక్కువగా శరీరం నుంచి రక్తం పోవడం.
- రక్తం తక్కువ తయారు కావటం, లేదా శరీరం నుంచి ఎక్కువ రక్తం బయటకు పోవడం.



రక్తహీనతపై అవగాహన పోస్టర్

- పేదల్లో సాధారణంగా ఉండే పోషకాహారం లోపం
- కొందరికి వారి తినే కొన్ని పదార్థాలు, కొన్ని మందుల వల్ల వస్తుంది.
- వివిధ ప్రోటీన్లు, విటమిన్ సీ, జింకు, రాగి వంటి ఖనిజాలు, మరికొన్ని ఇతర విటమిన్ల లోపం వల్ల, ఇనుము సరఫరా తగ్గిపోవడం.
- సీ విటమిన్ లోపంతో పళ్ల నుంచి రక్తం కారి స్కర్వీ వ్యాధి వల్ల వస్తుంది.
- పేగుపూత, కడుపులో మంట, గ్యాస్ట్రబుల్ ఉన్నవారు ఏది తిన్నా కడుపులో మంట వస్తుంది. దీని వల్ల వారు ఏమీ తినకపోయినా, మంచి పోషకాహారం తీసుకోకపోయినా అది శరీరానికి వంటబట్టక రక్తహీనత వస్తుంది.
- తరచూ నీళ్ల విరోచనాలతో బాధపడేవారికి తిన్నది వంటబట్టకపోయినా వస్తుంది.
- ఐరన్, ఫోలిక్ యాసిడ్, బీ–12, థైరాక్సిన్ లోపం
- కడుపులో పురుగులు రక్తం పీల్చుకోవటం వల్ల, రక్తం గడ్డకట్టే లక్షణం కోల్పోయిన హిమోఫీలియా వంటి అరుదైన జబ్బు ఉన్నవారికి వస్తుంది.

లక్షణాలు...

నీరసం, ఆకలి మందగించటం, ఆయాసం, పనిమీద శ్రద్ధ లేకపోవటం, కాళ్లు చేతులు నొప్పులు, కొద్దిసేపు పనిచేసినా అలసిపోవటం, శరీరం పాలిపోయినట్లు ఉండటం, ఛాతీ నొప్పి, గుండెదడ, కళ్లు తిరగటం, ఉన్నట్లుండి బైర్లు కమ్మటం, కింద పడిపోవటం వంటి లక్షణాలు రక్తహీనత ఉన్నవారిలో కనిపిస్తాయి. బాగా ఎక్కువగా ఉంటే పాదాలు, కాళ్లు, ముఖం వాయటం, నీరు చేరటం, భుజాల దగ్గర, నడుంలో, కీళ్లలో నొప్పులు ఉంటాయి. గోళ్లు, పెదాలు, పాలిపోవటం, గోళ్ల మధ్యలో చెంచాలాగా గుంటలు పడటం, నున్నగా మెరిసే నాలుక, పాలిపోయిన చిగుళ్లు, కంటి కింద రెప్పలోపలభాగం తెల్లగా ఉండటం, నాడి ఎక్కువగా కొట్టుకోవటం తదితర లక్షణాలు ఉంటాయి.

నివారణ చర్యలు

మహిళలు గర్భం వచ్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు ప్రతిరోజూ ఫోలిక్ యాసిడ్ మాత్ర మింగాలి. సీ విటమిన్ లభించే దానిమ్మ, ద్రాక్ష, బత్తాయి, చీని, నిమ్మ, నారింజ, కమలాలు, రేగు, ఉసిరి తినాలి. ప్రతి మనిషికీ రోజుకు కనీసం 30 మిల్లీ గ్రాముల ఇనుప ఖనిజం అవసరం. విటమిన్ బీ1, విటమిన్ బీ2, ఫోలిక్ యాసిడ్, విటమిన్ సీ అన్నీ కలిసి ఇనుప ఖనిజం శరీరానికి తగినంతగా అందించేందుకు తోడ్పడతాయి. రక్తం పుష్కలంగా తయారవ్వటానికి తాజా పండ్లు, ఆకు కూరలు, గోంగూర, పాలకూర, బచ్చలి కూర, తోటకూర, చిక్కుళ్లు, బఠానీలు, సజ్జలు, రాగులు, లివర్, గ్రుడ్లు, చేపలు, పప్పులు, బెల్లం ఎక్కువగా తీసుకోవాలి.

త్వరగా గుర్తించి నివారించాలి



రక్తహీనత స్త్రీలలో, పిల్లల్లో మరీ తీవ్రంగా ఉండి 5 నుండి 8 గ్రాముల మధ్య ఉంటే రోగ నిరోధక శక్తి తగ్గిపోయి త్వరగా జబ్బులకు గురవుతారు. గర్భిణీల్లో రక్తహీనత వల్ల వారికి పుట్టే పిల్లలు బరువు తక్కువగా పుడతారు. ఒక్కోసారి పుట్టిన వెంటనే బిడ్డ చనిపోతారు. కొన్నిసార్లు తల్లికూడా చనిపోయే ప్రమాదం ఉంది. రక్తహీనత ఉన్నవారు సరిగ్గా ఊపిరి పీల్చుకోలేకపోతారు. పిల్లలు ఎక్కువసేపు ఆటలు ఆడలేరు. చదువులో వెనుకబడిపోతారు. రక్తహీనతను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా నివారించవచ్చు.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య నిపుణురాలు, గుంటూరు

ఉచితంగా మాత్రల పంపిణీ

చిన్నపిల్లల్లో రక్తహీనత నివారణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో సిరప్, పౌష్టికాహారం , పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందిస్తున్నాం. కౌమార దశలో ఉండే బాలికలపై ప్రత్యేక దృష్టి సారించి వారిలో రక్తహీనత నివారణ చర్యలు తీసుకుంటున్నాం. గర్భిణీకి పేరు నమోదు చేసిన మూడో నెల నుంచే రక్తహీనత నివారణ కోసం ప్రత్యేక ప్రణాళికతో వైద్యసేవలను అందిస్తున్నాం. మాత్రలు అందించటంతోపాటు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇచ్చి అవసరమైతే రక్తం కూడా ఉచితంగా ఎక్కించి రక్తహీనత నివారణా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

క్లుప్తంగా

న్యాయమూర్తి కృపా సాగర్‌ను కలిసిన బార్ కౌన్సిల్ సభ్యులు



పట్నంబజారు: జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన రిలవెన్స్ ఆఫ్ ఫ్యాక్ట్స్ ఇన్ క్రిమినల్ కేసెస్ శిక్షణ తరగతుల్లో భాగంగా గుంటూరు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి వి.ఆర్.కె.కృపాసాగర్‌ను రాష్ట్ర బార్ కౌనిల్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. న్యాయమూర్తి కృపాసాగర్‌ను కలసిన వారిలో బార్ కౌన్సిల్ సభ్యుడు వి.బ్రహ్మారెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు నుంచి గాంధీ పార్కు పునఃప్రారంభం

నెహ్రూనగర్: మిచాంగ్ తుఫాన్ కారణంగా మూసివేసిన గాంధీ పార్కును తిరిగి ఆదివారం నుంచి పునఃప్రారంభించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్కు వద్ద ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మహిళలకు, పురుషులకు వేర్వేరుగా టికెట్ కౌంటర్స్‌తో పాటు తాగునీరు అందుబాటులో ఉంచామని ఆమె పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



గుంటూరు మెడికల్: క్రీస్తు బోధనలు ఆచరిస్తూ, తారతమ్యాలు లేకుండా మనుషులంతా ఒక్కటిగా ఉండాలని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు.సీటీవీఎస్ వార్డులో శనివారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాటి మనుషులపై ప్రేమ, కరుణ, సహనం, సమానవత్వం కలిగి ఉండాలని తెలిపారు. ప్రముఖ గుండె ఆపరేషన్ వైద్య నిపుణులు డాక్టర్ ఆళ్ళ గోపాల కృష్ణ గోఖలే మాట్లాడుతూ నలుగురికి మంచి చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. క్రీస్తు నలుగురి కోసం ప్రాణం త్యాగం చేశారని గుర్తు చేశారు. ముందుగా క్రిస్మస్ కేక్‌ను డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ గోఖలే కట్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, డాక్టర్ మోతీలాల్, డాక్టర్ రామరాజు, డాక్టర్ ప్రమోద, డాక్టర్ సతీష్ కుమార్, కె.ఆశా సజని, పద్మజ పాల్గొన్నారు.

ఘనంగా హరికథా గాన త్రిమూర్తుల ఆరాధనోత్సవాలు



పాత గుంటూరు: అరండల్‌పేట 4వ లైనులోని శ్రీగంగా మీనాక్షి సోమసుందరేశ్వర స్వామి దేవస్థానంలో కోట హరికథ గాన కళాపీఠం ఆధ్వర్యంలో హరికథ గాన కళా త్రిమూర్తులు బ్రహ్మశ్రీ అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసవర్యులు, శ్రీమాన్ పెద్దింటి సూర్యనారాయణ దీక్షిత దాసవర్యులు, బ్రహ్మశ్రీ పరిమి సుబ్రహ్మణ్యశర్మ భాగవతులు ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి సుబ్రహ్మణ్యశర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానందశాస్త్రిని ఆలయ ధర్మకర్త ఏకా ప్రసాద్, కుందుర్తి భాస్కర్‌శర్మ ఘనంగా సన్మానించారు. సచ్చిదానంద శాస్త్రి మాట్లాడుతూ ప్రస్తుతం కళల్ని నమ్ముకున్న వారి కుటుంబాలు దారుణమైన స్థితిలో ఉన్నాయని, వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం హరికథా గానాన్ని ఆలపించగా, ఎం.నగధర్, కె. రాజ్యలక్ష్మి వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సిరిపురపు శ్రీధర్, ధూళిపాళ్ల భాస్కర్, కోట శివశాస్త్రి, శ్రీరామ చంద్రమూర్తి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతిరాణికి పురస్కారం



ప్రత్తిపాడు: స్థానిక రామానగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న తమలపాకుల జ్యోతిరాణి సావిత్రీ బాయి పూలే విశిష్ట మహిళా పురస్కారానికి ఎంపికయ్యారు. ఆమె రెండు దశాబ్దాలకు పైగా సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ప్రజాచైతన్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె సేవల్ని గుర్తించిన విశాఖపట్నానికి చెందిన సావిత్రీ బాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ పురస్కారాన్ని జనవరి 3న సావిత్రీ బాయి పూలే 193వ జయంతి నాడు విశాఖపట్నంలో అందించనుంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ముస్తఫా



పట్నంబజారు: నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని 15వ డివిజన్ రెడ్లబజారు, 14వ డివిజన్ లాంచస్టర్ రోడ్డులో శనివారం ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం సైడు కాల్వలు, డ్రైయిన్లను పరిశీలించి కార్పొరేషన్ సిబ్బందితో పనులు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రజల సమస్యల్ని పరిష్కరించేందుకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడతానని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామనబోయిన అజయ్‌యాదవ్, వేముల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

గుంటూరు రూరల్: మహిళ మెడలో గొలుసును అపహరించిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. గోరంట్ల విష్ణునగర్‌కు చెందిన కె. శివరంజని ఇంటి నుంచి నడుచుకుంటూ రోడ్డు పైకి వస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు భరోసా కల్పించిన సీఎం జగన్

పట్నంబజారు: ప్రతి పేదవాడికి తానున్నాననే భరోసా కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. 55వ డివిజన్ వెంగయ్యనగర్‌లో శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ పేదవారి సంక్షేమాన్ని తన భుజాన వేసుకుని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నేతలు అగ్గిపెట్టి రాజు, నాగేశ్వరరావు, రమేష్, రవిరాజ్, వినోద్, విజయ్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ ఆధ్వర్యంలో బొంగరాలబీడు యానాది కాలనీలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కాలనీ వాసులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.



వృద్ధురాలికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న నూరిఫాతిమా

సీఏలు, కంపెనీ సెక్రటరీలకు పుష్కల అవకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశం ఆర్థికంగా బలోపేతం కానున్న నేపథ్యంలో సీఏలు, కంపెనీ సెక్రటరీలకు పుష్కలమైన అవకాశాలున్నాయని హైదరాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) కేంద్ర పాలకమండలి సభ్యుడు రాజవోలు వెంకటరమణ పేర్కొన్నారు. శ్రీనివాసరావుతోటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ కార్యాలయంలో శనివారం ఐసీఏఐ, ఐసీఎస్ఐ–అమరావతి చాప్టర్ సంయుక్తంగా ఎల్ఎల్‌పీ, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలపై ఒక్క రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ భారతదేశం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందని, ఇందులో ప్రైవేటు, పబ్లిక్ రంగ సంస్థలతో పాటు ఎల్ఎల్‌పీలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఆయా సంస్థలు నియమ, నిబంధనలకు అనుగుణంగా నడవడంలో సీఏలు, కంపెనీ సెక్రటరీ (సీఎస్)ల పాత్ర ఎంతో ఉందని వివరించారు. ఎస్ఐఆర్‌సీ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ఆర్థిక రంగంలో కాలానుగుణంగా చోటు చేసుకుంటున్న మార్పులను ప్రజలకు చేరువ చేయడంలో సీఏలు, సీఎస్‌లు కీలక బాధ్యతలు పోషిస్తున్నారని చెప్పారు. సదస్సులో ఐసీఎస్ఐ అమరావతి చాప్టర్ చైర్మన్ సోము శివరామకృష్ణ, ఐసీఏఐ గుంటూరు చాప్టర్ చైర్మన్ మద్ది రవితేజ, కార్యదర్శి చింతా రఘునందన్, సీఏలు, సీఎస్‌లు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవితేజ

తైక్వాండో చాంపియన్‌షిప్‌లో విద్యార్థులకు పతకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో ఇటీవల జరిగిన అంతర్ పాఠశాలల తైక్వాండో చాంపియన్‌షిప్‌లో ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ హేమ తెలిపారు. శనివారం కొత్తపేటలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అండర్–14 విభాగంలో కె. మనీష్, జి.కుమార్ తేజ, సీహెచ్. నాగ రామ్ చరణ్ బంగారు పతకం, పి. మణికంఠ కార్తీక్ రజత పతకం పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు కరాటే శిక్షకులు బి. కాశీనాథ్‌రెడ్డి, డి. విజయ్, బి. సాయి సుబ్రహ్మణ్యంను ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్‌బాబు, ప్రిన్సిపాల్ హేమ, ఇన్‌చార్జ్ జయమున్నీసా, ఏజీఎం భాను ప్రసాద్ అభినందించారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ హేమ

లాలాపేట పీఎస్ ఎస్ఐకు డిస్క్ సిల్వర్ అవార్డు

నగరంపాలెం: గుంటూరు తూర్పు సబ్ డివిజన్‌లోని లాలాపేట పోలీస్‌స్టేషన్ (పీఎస్) ఎస్ఐ ఆర్.ఎం.విజయ్ కుమార్‌కు డిస్క్ సిల్వర్ అవార్డు లభించింది. నేర పరిశోధనలో కనబరిచిన ఉత్తమ ప్రతిభకుగాను శనివారం మంగళగిరి డీజీపీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదగా ఎస్ఐ విజయ్‌కుమార్ డిస్క్ సిల్వర్ అవార్డును అందుకున్నారు. లాలాపేట పీఎస్‌లో ఎస్ఐను సీఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది అభినందించారు.



డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్ఐ విజయ్‌కుమార్

20న 'జగనన్నకు చెబుదాం'

పొన్నూరు: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 20న జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో పట్టణ, మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యల్ని రాతపూర్వకంగా తెలియజేస్తే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జీడీసీసీ విశ్రాంత ఉద్యోగులకు హెల్త్ కార్డుల పంపిణీ



నగరంపాలెం: విశ్రాంత ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఎంతో ప్రయోజనకరమని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు అన్నారు. ఇఫ్‌కో–టోకియో కంపెనీ ఆధ్వర్యంలో జీడీసీసీ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు శనివారం గుంటూరు బ్రాడీపేటలోని బ్యాంక్ ఆవరణలో హెల్త్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతారామాంజనేయులు మాట్లాడుతూ 300 మంది విశ్రాంత ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందించడం శుభపరిణామమని తెలిపారు. రూ.3లక్షల వరకు నిర్ణయించిన ఆస్పత్రిల్లో వైద్యసేవలు పొందేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఇఫ్‌కో–టోకియా కంపెనీ గుంటూరు ప్రాంతీయ మేనేజర్ మాట్లాడుతూ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండేందుకు తమ కంపెనీ ఈ హెల్త్ కార్డును పంపిణీ చేసిందని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో టి.కృష్ణవేణి, ఏపీ సీసీబీ రిటైర్డు యూనియన్ ఉపాధ్యక్షులు బి.వి.శర్మ, వి.ఆర్.రాధాకృష్ణమూర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయిన సుబ్బారావు, జగన్నాథరెడ్డి, రాష్ట్ర డెప్యూటీ కార్యదర్శి తేళ్ల నరసింహారావు, ఏఐటీయూసీ నాయకులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాబు బూటకపు హామీలపై విస్తృత ప్రచారం



గుంటూరు ఎడ్యుకేషన్: అధికారమే ధ్యేయంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఇస్తున్న ఆచరణ సాధ్యం కాని బూటకపు హామీలపై కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. 25వ డివిజన్‌లో శనివారం కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి ఆధ్వర్యంలో ఆదర్శనగర్‌లో ''బాబు ఆపు నీ నాటకం–జగనన్నే మా నమ్మకం'' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 79 వార్డు సచివాలయ కన్వీనర్ ఓర్సు ఏడుకొండలు ఇంటింటికీ వెళ్లి నవరత్నాల కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రగతి పత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లతో పాటు 17వ క్లస్టర్ గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఐఎస్‌పై వైద్య సిబ్బందికి శిక్షణ

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో శనివారం వైద్య సిబ్బందికి హెచ్‌ఎంఐఎస్ డేటాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల డేటాను ఎప్పటికప్పుడు హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఈనెల 18న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 5 లక్షల నుంచి రూ.25 లక్షలు పెంచే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. మండల స్థాయి ఉద్యోగులు మండల ఆఫీసు కేంద్రం, జిల్లాస్థాయి ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయంలోని వీడియో సమావేశ మందిరంలో హాజరుకావాలని ఆయన తెలిపారు. ఆరోగ్యశ్రీ అవగాహన పోస్టర్లు, కరపత్రాల్ని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికీ అందజేయాలని డీఎంహెచ్‌వో సూచించారు. స్టాటిస్టికల్ ఆఫీసర్ వి. పద్మజ, ఉప స్టాటిస్టికల్ ఆఫీసర్ భానుశ్రీ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు ?

పట్నంబజారు: పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల నల్లచెరువు ప్రాంతంలో సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులు స్థానికులకు దొరికారు. నిందితుల్ని సెల్‌ఫోన్ వీడియోలో రికార్డు చేశారు. ఆటో నంబరు ఆధారంగా వారిని లాలాపేట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

పోలీసుల అదుపులో మత్తు పదార్థాలు కలిగిన వ్యక్తి

మత్తు పదార్థాలు కలిగి ఉన్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు... సంపత్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ నుంచి 'ఎం' అనే మత్తు పదార్థాలను తీసుకొస్తున్న క్రమంలో పక్కా సమాచారం అందుకున్న సెబ్ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నిందితుడిని లాలాపేట పోలీసులకు అప్పజెప్పినట్లు తెలుస్తోంది. అయితే, మత్తు పదార్థాలు తీసుకొచ్చిన వ్యక్తితో పాటు, పూర్తిస్థాయిలో వీటిని వేరే ప్రాంతాల నుంచి తెప్పిస్తున్న మరో వ్యక్తి ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. సదరు వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 20 గ్రాముల 'ఎం' అనే మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటి విలువ భారీగా ఉన్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. మత్తు పదార్థాల్ని గుంటూరు నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారా.. లేదా విద్యార్థులు, యువకులు వినియోగిస్తున్నారా ? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

అలరించిన సినీ సంగీత విభావరి



పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా ఘట్టమనేని సేవా సమితి ఆధ్వర్యంలో సూపర్ స్టార్ కృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా తెలుగు వీర లేవరా పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు పర్వేజ్ చిష్టి అధ్యక్షత వహించారు. కృష్ణ నటించిన చిత్రాల్లోని పాటలకు కళాకారుల డ్యాన్స్ అభిమానుల్ని ఆకట్టుకుంది. గాయకులు సినీ గీతాల్ని ఆలపించి అలరించారు. కళాకారులు, ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. గుంటూరు కారం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.సుశీల్ కుమార్, సురభి ఏసు, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి మహ్మద్ నజీర్, కొండా కోటిరెడ్డి, అభిమానులు పాల్గొన్నారు.